## ఏలూరుపాడులో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - కాళ్ల

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో సోమవారం పర్యటించారు. సభ్యులకు గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, గ్రామ కార్యదర్శి అరుణాదేవి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూల్, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం.మధుమతి గ్రామంలో వ్యక్తిగత గృహాలను ర్యాండంగా పరిశీలించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉన్నది లేనిది, ఆ ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో ఏమైనా కాలుష్యాలు, పండ్లు పెంచుతున్నారా లేదా అనే అంశాలను కేంద్ర సర్వేయర్ డైరెక్ట్‌గా సర్వే చేశారు. అంశాలను కేంద్ర సర్వేయర్లతో స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు టివిఎస్.రవికిరణ్, జిల్లా కన్సల్టెంట్ ఎం.సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ ఎవి.భాస్కర రావు పాల్గొన్నారు.

# శిక్షణిచ్చేందుకు వెళ్లి శవమై వచ్చారు..!

- నల్లజర్లలో అరటకట్ల హెచ్‌ఎం మూర్తిరాజు గుండెపోటుతో మృతి
- ప్రభుత్వ తీరుతో ఒత్తిడికి గురయ్యారని ఉపాధ్యాయ సంఘాల ఆవేదన



మూర్తిరాజు (ఫైల్‌ఫోటో)

మూర్తిరాజు భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పాలకొల్లు

'ఉదయమే నేనే బండిపై తీసుకెళ్లి బస్సు ఎక్కించాను. ఇప్పుడు శవమై వచ్చారా' అంటూ ఆమె రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. పాలకొల్లు మండలం అరటకట్ల జెడ్‌పి హైస్కూల్లో హెచ్‌ఎంగా పని చేస్తున్న ఎస్‌విఆర్.మూర్తిరాజు (61) తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య పద్మావతి, కుమారుడు దిలీప్ వర్మ, కుమార్తె లాస్యవర్మ ఉన్నారు. నల్లజర్లలో సోమవారం రిసోర్స్‌పర్సన్‌గా వెళ్లారు. ఆయన శిక్షణ తరగతి ప్రారంభించి మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆయనను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని పాలకొల్లు హౌసింగ్ బోర్డులోని స్వగృహానికి తరలించారు. ఉదయం తన మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి బస్టాండ్‌లో బస్ ఎక్కించిన భర్త జీవం లేకుండా తిరిగి రావడాన్ని చూసి ఆయన భార్య తల్లడిల్లారు. కుమారుడు ప్రస్తుతం ఎంఎస్ చేయడానికి అమెరికాలో ఉన్నారు. వివాహితైన కుమార్తె హైదరాబాద్ నుండి బయల్దేరారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజశేఖర్, పి.శ్రీనివాసరావు, నేతలు శీలం ఆంజనేయులు, జి.ప్రకాష్, సాంబమూర్తి, నేతలు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

**ఉపాధ్యాయుల ప్రాణాలతో అధికారుల చెలగాటం**
**యుటిఎఫ్ నేతల విమర్శ**

మూర్తిరాజు గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వారు పాలకొల్లులోని మూర్తి రాజు ఇంటి వద్ద ప్రజాశక్తితో మాట్లాడారు. అధికారులు శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. దీనికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణ, వెబెక్స్ ఆన్‌లైన్ మీటింగులతో ఉపాధ్యాయులను భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల తెరిచిన ఈ రెండు నెల్లలో ఉపాధ్యాయులను పిల్లలకు సంతృప్తిగా పాఠాలు బోధించకుండా యోగాంధ్ర, మెగా పేరెంట్ మీటింగ్ తదితర కార్యక్రమాలతో తీవ్ర ఒత్తిడికి గురి చేశారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కంటే, ఆ కార్యక్రమాల ఫొటోలు, డాక్యుమెంటేషన్, వీడియోలు అప్లోడింగ్ పని భారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు మానసిక ప్రశాంతత ఉంటే మంచి బోధన చేయగలుగుతారన్నారు. మూర్తిరాజు మృతికి సంతాపంగా, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను ఆపాలని కోరుతూ మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ నిరసనల్లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు పద్మావతి, మండల అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.రామ్మూర్తినాయుడు, గౌరవాధ్యక్షులు వి.జగ్గారావు, కార్యదర్శులు బి.శైలజ, ఎం.బాపిరాజు. ఎం.శ్రీధర్, ఎం.రాంబాబు, జిల్లా కౌన్సిలర్ ఆర్.సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

## ప్రధానోపాధ్యాయుడు మూర్తిరాజు మృతి బాధాకరం

**పని ఒత్తిడే ప్రధాన కారణం**
**యుటిఎఫ్ సంతాపం**

భీమవరం : నల్లజర్లలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో అరటకట్ల (గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు ఎస్‌విఆర్.మూర్తిరాజు మృతి చెందడం అత్యంత బాధాకరమని యుటిఎఫ్ జిల్లా కమిటీ విచారం వ్యక్తం చేసింది. పని ఒత్తిడి ఫలితంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఆరోపించింది. మూర్తిరాజు మృతి పట్ల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మూర్తిరాజు ట్రైనింగ్ మొదలవ్వగానే ఆయన మాట్లాడుతూనే కుప్పకూలిపోయారని పేర్కొన్నారు. వైద్య సహాయం కోసం సహచరులు ఆసుపత్రికి తీసుకెళ్లేసరికే అప్పటికే ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ నెల 10న మెగా పేరెంట్స్, టీచర్స్ డే సందర్భంగా మూర్తిరాజు చాలా ఒత్తిడిలో పని చేశారని సహచర ఉపాధ్యాయులు చెబుతున్నారని పేర్కొన్నారు. తనను రిసోర్స్‌పర్సన్ విధుల నుంచి తప్పించాలని మూర్తిరాజు కోరినప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. మెగా పేరెంట్స్, టీచర్స్ డే పూర్తయినా వీడియోలు సరిగ్గా పెట్టలేదు, ఫొటోలు సరిగ్గా పెట్టలేదు అనే పేరుతో గత శని, ఆదివారాలు సెలవు రోజులైనా ప్రధానోపాధ్యాయులు ఎవరూ మనశ్శాంతిగా గడపలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను ఈ విధమైన ఒత్తిడితో పని చేయించడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

**మూర్తిరాజు మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత: ఫ్యాప్టో**

మూర్తిరాజు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఫ్యాప్టో చైర్మన్ పిఎస్.విజయరామరాజు, కోఛైర్మన్ సాయివర్మ, సెక్రటరీ జనరల్ ప్రకాష్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి ఉపాధ్యాయ సంఘాలు దూర ప్రాంతాల్లో రెసిడెన్షియల్ మోడ్ శిక్షణ రద్దు చేయాలని కోరుతున్నాయని పేర్కొన్నారు. ఒంటెద్దు పోకడలతో అధికారులు, ప్రభుత్వాలు పంతాలకు పోయి ఉపాధ్యాయుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని విమర్శించారు.

**ప్రధానోపాధ్యాయుల మృతి అత్యంత బాధాకరం**
**ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్**

అరటకట్ల ప్రధానోపాధ్యాయులు ఎస్‌విఆర్.మూర్తిరాజు మృతి అత్యంత బాధాకరమని, అనారోగ్యంగా ఉందని చెప్పినప్పటికీ ఆయనను శిక్షణ విధులకు హాజరు కావాలని అధికారులు ఒత్తిడి ఇవ్వడం అత్యంత దారుణమని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు అత్యంత ఒత్తిడిలో విధులకు హాజరవుతున్నారని తెలిపారు. ఇటువంటి తీవ్రమైన ఒత్తిడి చేస్తే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి గతం నుంచి ఉన్నా, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, దీన్ని ఎస్‌టియు తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ఉపాధ్యాయుల పట్ల కక్షపూరిత ధోరణితో కాకుండా సామరస్య పూర్వకంగా ఆలోచించాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# గర్జించిన గీత కార్మికులు

'కలెక్టర్ కు చెబుదాం రండి'కి తరలొచ్చిన గీత కార్మికులు
మోకులు ధరించి వినూత్న నిరసన
గీత వృత్తి పరిరక్షణకు పిడిఎఫ్ ప్రత్యక్ష ఉద్యమం
ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి
బెల్టుషాపులు తొలగించకపోతే భవిష్యత్తు కార్యాచరణ
కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి
జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేత

జెసికి వినతి అందిస్తున్న గోపీమూర్తి, జుత్తిగ నరసిహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

తమ హక్కులను పరిరక్షించాలని, గీతవృత్తిని కాపాడాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యాన భీమవరం కలెక్టరేట్ వద్ద చేపట్టిన 'కలెక్టర్‌కు చెబుదాం రండి' కార్యక్రమానికి వందలాది మంది గీత కార్మికులు తరలొచ్చి సమస్యలపై గర్జించారు. మోకులు ధరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి మహిళా కార్మికులు సైతం తోడయ్యారు. గీత కార్మికుల ఆందోళనకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు, ఎక్సైజ్ పాలసీల వల్ల గీత కార్మికుల భవిష్యత్తు కనుమరుగవుతుందన్నారు. గీత వృత్తిలో ప్రమాదం జరిగితే పట్టించుకునే పరిస్థితి ప్రభుత్వం వైపు నుంచి లేదన్నారు. గీత కార్మికుల ఆందోళనకు పిడిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఎపి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ అక్రమ బెల్ట్ షాపులు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో, ఎక్సైజ్ అధికారుల సహకారంతోనే నడుపుతున్నారని ఆరోపించారు. నర్సాపురం తదితర ప్రాంతాల్లో గీత కార్మికులపై అక్రమ మద్యం అమ్ముతున్న వారు దాడులు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 70 వేల బెల్ట్ షాపులున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పైగా అధికార పార్టీ నేతలే వాటిని నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. అక్రమ మద్యానికి పాలకొల్లు అడ్డాగా మారిందని, ఒక మంత్రి అనుచరులే వీటిని నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తాటిచెట్లపై హక్కును గీత కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన గీత కార్మికుడికి రూ.5 లక్షలు, మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో గీత కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ గతంలో కిస్తీల పేరుతో రూ.3 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లించేవారమని గుర్తు చేశారు. అక్రమంగా తాడి చెట్లను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. అనంతరం తిరుమల విద్యాసంస్థల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడలి పాండు, బొక్కా చంటి, కాగిత రాధాకృష్ణ, దాసరి సూరిబాబు, బొక్కా సోమేశ్వరరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, గీత కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళనలో నినదిస్తున్న గీత కార్మికులు

# శాంతించిన గోదావరి

ప్రజాశక్తి - ఆచంట

మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన వశిష్ట గోదావరి సోమవారం తగ్గుముఖం పట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. దీంతో లంక గ్రామాల ప్రజలతోపాటు గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలకు మూడు రోజుల నుంచి రాకపోకలు నిలిచిపోయినసంగతి తెలిసిందే. ఇంకా గోదావరిపై పడవల రాకపోకలను పునరుద్ధరించలేదు. అయోధ్యలంక, పుచ్చల్లంక, నెక్కిలంక, మర్రిమూల, పల్లిపాలెం, పెదమల్లం లంక ఆనగార్లలంక గ్రామాల ప్రజలు గోదావరి తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. కరుగోరుమిల్లి వద్ద అయోధ్యలంకకు వెళ్లే ర్యాంప్ మార్గం పూర్తిగా నీట మునిగింది. గోదావరి వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు నది పరివాహక ప్రజలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

యలమంచిలి: కనకాయలంక కాజ్‌వేపై ప్రారంభమైన రాకపోకలు

యలమంచిలి: గోదావరి వరద సోమవారం తగ్గుముఖం పట్టింది, దీంతో వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక తదితర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధానంగా కనకాయలంక కాజ్‌వేపై వరద నీరు సుమారు రెండు అడుగుల మేర తగ్గుముఖం పట్టడంతో స్థానిక ప్రజల రాకపోకలు సాగిస్తున్నారు.

# డిగ్రీలో ఆఫ్‌లైన్ అడ్మిషన్లు కొనసాగించాలి

**జెసి రాహుల్ కుమార్ రెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ నేతల వినతి**



జెసికి వినతి పత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

డిగ్రీ డబల్ మేజర్ విధానం కొనసాగించాలని, అడ్మిషన్లను ఆఫ్‌లైన్ పద్ధతిన నిర్వహించాలని, ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి స్థానిక కలెక్టరేట్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి.గణేష్ మాట్లాడుతూ సాధారణ డిగ్రీ విద్యలో ఉన్నత విద్యామండలి తీసుకొస్తున్న మార్పులు విద్యార్థులను గందరగోళంలోకి నెట్టివేస్తున్నాయన్నారు. డబల్ మేజర్ విధానంను ప్రకటించి, అచరణలో దాని లాభనష్టాలను చూడకుండానే రివ్యూ నిర్వహించి సింగిల్ మేజర్ విధానంను కొనసాగించాలని నిర్ణయించారన్నారు. సింగల్ మేజర్ విధానం ఇప్పటికే అచరణలో విఫలమైందని, ఫెయిల్ అయిన విధానంను మరలా కొనసాగించడం భావ్యం కాదన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. డిగ్రీ విద్యలో డబల్ మేజర్ విధానంను అమలు చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ఇంకా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ మొదలు కాలేదన్నారు. దీనివల్ల ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీ చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. వెంటనే డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించాలని కోరుతున్నామని తెలిపారు. అదేవిధంగా డిగ్రీ ప్రవేశాలు ఆఫ్‌లైన్‌లో ఉండటం వల్ల ఎక్కువ శాతం సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని, దీంతో పాటు విద్యార్థులు ఏ కళాశాలలో చేరాలనుకుంటే అక్కడ జాయిన్ అయ్యే అవకాశం ఉండటం లేదన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి, మైనర్ సబ్జెక్టుకు క్రెడిట్ పాయింట్స్ పెంచాలన్నారు. విద్యార్థి చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, ఇంటర్న్‌షిప్ చేస్తున్న సందర్భంలో విద్యార్థులకు తగిన స్టైఫండ్ ఇచ్చే విధంగా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్ చేస్తున్న ప్రాంతాలలో విద్యార్థులకు భద్రత ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వినతిని అందించిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు బి.సింధు, పట్టణ కమిటీ సభ్యులు ఎం.భాగ్యలక్ష్మి, పి.సాయికృష్ణ ఉన్నారు.

# పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి**

సమస్యలు వింటున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, పిజిఆర్‌ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 235 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన, నాణ్యమైన పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. జిల్లా, మండల అధికారులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# లేస్ ఉత్పత్తులకు జిఐ గుర్తింపు

**ఒడిఒపి అవార్డు అందుకున్న కలెక్టర్ నాగరాణి**

అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నులు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం న్యూఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో ఏర్పాటుచేసిన ఒడిఒపి అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని 'నరసాపూర్ క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్'కు అవార్డును అందుకున్నారు. కేంద్ర వాణిజ్య పన్నులు, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 7 ఉత్పత్తుల్లో పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్‌కు ఒడిఒపి అవార్డు లభించింది. ఇప్పటికే 'నరసాపూర్ క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కు గత సంవత్సరం (జిఐ) గుర్తింపుకు ఎంపిక కాబడింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 8 జౌళి చేతి ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లేసుకు భౌగోళిక సూచిక (జిఐ) గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 25, 2024న న్యూఢిల్లీలోని హోటల్ ఒబెరాయ్‌లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చేతులు మీదుగా (జిఐ) సర్టిఫికేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నరసాపూర్ లేస్ అల్లికలకు గత సంవత్సరం జిఐ గుర్తింపు రావడం, నేడు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపులతో వేలాదిమంది నేత కార్మికులు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వగలుగుతామన్నారు. ప్రత్యేక ఉత్పత్తుల ప్రోత్సాహం, మార్కెట్ లింకేజి, బ్రాండింగ్ ప్రమోషన్ లక్ష్యంగా ఇప్పటికే పనిచేస్తున్నట్లు తెలిపారు. భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమలో చేతితో నేసిన, చేతితో తయారు చేసిన వస్త్రాలు దేశంలో భౌగోళిక సూచిక నమోదిత ఉత్పత్తుల పట్టికలో అగ్రగామిగా ఉన్నాయని తెలిపారు. దేశంలో జిఐ ట్యాగ్ చేయబడిన హ్యాండ్లూమ్స్, హస్తకళా ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకుంటాయన్నారు. అంతర్జాతీయ గుర్తింపుతో పాటు, రాష్ట్రంలో జిఐ గుర్తింపు పొందిన ఉత్పత్తుల్లో ఒకటిగా మన లేసు ఉత్పత్తులు నిలవడానికి కారణమైన తయారీదారుల కృషి ఫలితంగా నేడు మరో అవార్డును ఒడిఒపి కింద పొందగలిగామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి లేసు తయారీదారులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖామంత్రి ఎస్.సవిత, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, ఐఎఎస్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, ఒడిఒపి అవార్డుకు ఎంపికైన జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్ ప్రారంభిస్తున్న ఎస్‌పి

## పెదఅమిరంలో పోలీసులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కాళ్ల

డిజిపి ఆదేశాల మేరకు పోలీసులకు హెల్త్ క్యాంపును పెదఅమిరం మిత్ర మెడికేర్ ఆస్పత్రిలో డిస్కౌంట్ రేట్‌కి వైద్యం అందించేందుకు ముందుకు రావడానికి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ అభినందించారు. సోమవారం పెదఅమిరంలో మిత్ర మెడికేర్ హాస్పిటల్‌లో పోలీసులకు ఆరోగ్య పరీక్షలు, ఒపి, రక్తపరీక్షలు నిర్వహించే కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు వారి కుటుంబసభ్యుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిత్ర మెడికేర్ ఆసుపత్రి సిఇఒ డాక్టర్ విక్రాంత్ చుండూరి మాట్లాడుతూ ప్రివెంట్ హెల్త్ కేర్ ద్వారా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి ముదరక ముందు వ్యాధి నయం చేసుకోవచ్చన్నారు. ఎవరికి ఏ జబ్బు రాకముందు గుర్తించి వైద్యం అందిస్తే గుండె, లివర్ వ్యాధులు నయం చేసుకోవచ్చన్నారు. ఇటీవల పలువురు ఎస్‌ఐ, సిఐలు సైతం గుండెపోటుతో మృతిచెందారని అందుకే తరచు పరీక్షలు చేయించుకొంటూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఈరోజు 80 మంది సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. జిల్లాలో 400 మంది పోలీసులకు వైద్య పరీక్షలకు 10 రోజుల పాటు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి భీమారావు, భీమవరం డిఎస్‌పి జయ సూర్య, పట్టణ, రూరల్ సిఐలు, ఎస్‌ఐలు, మిత్ర మెడికేర్ ఆసుపత్రి సిఇఒ డాక్టర్ విక్రాంత్ చుండూరి, డాక్టర్ సాయిబాబు చుండూరి, డాక్టర్ మల్లేశ్వరి చుండూరి, ఆస్పత్రి మేనేజర్ భగవాన్, ఇన్‌ఛార్జి రామ్ చరణ్, పిఆర్‌ఒ బొడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగుకు నీరందించాలి

**కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు**

గుమ్ములూరులో ఎండుతున్న నారుమడి చూపిస్తున్న కౌలురైతు

ప్రజాశక్తి - భీమవరం

సమృద్ధిగా నీరున్నా ఎండుతున్న సార్వా నారుమళ్లకు సాగునీరివ్వాలని ఎపి కౌలురైతుల సంఘం డిమాండ్ చేసింది. సాగునీటి సమస్యపై పోడూరు, ఆచంట, ఆకివీడు, యలమంచిలి, పాలకోడేరు, అత్తిలి, వీరవాసరం మండలాలకు చెందిన రైతులతో సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు గోదావరి నీరు సముద్రంలోకి వెళ్తుంటే.. మరోపక్క అధికారుల నిర్లక్ష్యంతో నారుమళ్లు ఎండిపోతున్నాయన్నారు. వేలాది ఎకరాల్లో సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోయాయని, కనీసం దమ్ము చేసే అవకాశం లేదని కౌలురైతులు ఆందోళన వ్యక్తం చేశారన్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో నారుమళ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాలువలు వదిలి రెండు నెలలైందని, మరోపక్క గోదావరి ఉధృతంగా సముద్రంలోకి వెళ్తున్నా రైతులకు ఈ కర్మేమిటని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో సార్వా పంట ఆలస్యమైందని, దాళ్వా మే, జూన్ నెలల్లో వచ్చిన తుఫాన్లకు గురై రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో అన్ని పంట కాలువలకు లెవిల్ పెంచి పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలన్నారు. తక్షణం చించినాడ, కవిటం, దేవ, చినమల్లం బ్యాంక్ కెనాల్, మొగల్లు పంట కాలువలకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగావకాశాలు వినియోగించుకోవాలి : జెసి

భీమవరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కల్పిస్తున్న ఉద్యోగావకాశాలు యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జెసి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈనెల 23వ తేదీన నరసాపురం శ్రీవైఎన్ కళాశాలలో నిర్వహించనున్న మెగా ప్లేస్మెంట్ డ్రైవ్(ఉద్యోగ దిక్సూచి) కి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో సుమారు 15 ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. వివిధ కంపెనీలలో 700కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన పురుషులు, మహిళా అభ్యర్థులు అర్హులు అన్నారు. కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ లింక్ https://naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరములకు ఈ క్రింది నెంబర్లను 94508 38388, 95020 24765, సంప్రదించాలని తెలిపారు. డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, బి.శివన్నారాయణ రెడ్డి, పి.లోకమాన్ పాల్గొన్నారు.

## జమ్ము తూడు బెడద నివారించండి : కెవిపిఎస్

పెనుమంట్ర : మండల కేంద్రం పెనుమంట్ర గ్రామంలోని పెద్దచెరువుగట్టు ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న పంట పొలాల్లో విపరీతంగా పెరిగిన జమ్ము అనే తూటు మొక్కల వల్ల పెక్కు సమస్యలతో ఆ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాల నుంచి పంటలు పండించకపోవడం వల్ల అక్కడ ఉన్న పంట పొలాల్లో జమ్ము విపరీతంగా పెరిగిందని అన్నారు. ఇక్కడ జమ్ము పెరగడంతో దుమ్ము, ధూళి, పీచు లాంటివి ఎగిరి స్థానిక ఇళ్లల్లోకి వస్తున్నాయని, దాని కారణంగా ఇండ్లను ఎంత శుభ్రం చేసినా చేయనట్టుగానే కనిపిస్తున్నాయని అన్నారు. అంతే కాక తినే ఆహార పదార్థాల్లో జమ్ము ధూళి రేఖలు పడుతున్నాయని, దోమలు, ఈగలు, ఇతర కీటకాలు విపరీతంగా వస్తున్నాయని, చిన్నపిల్లలకు, వృద్ధులకు దోమలు, కీటకాలు కుట్టడం వల్ల అనారోగ్య పాలు అవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ అధికారులు ఆ జమ్మును తొలగించి స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# కొత్త నీరు వచ్చింది.. రోగాలు పెరిగాయి!

## కానరాని ముందస్తు చర్యలు

**ప్రజాశక్తి - ఆకివీడు**

కొత్త నీరు వచ్చింది రోగాలు పెరిగాయి. దీంతో రోగులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయి. ప్రతి ఊరిలోనూ ప్రతి ఇంటిలోనూ జ్వరపీడితులే. కొత్తనీరు రావడంతో ప్రతియేటా ఆషాఢమాసంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిసినా అధికారులు ముందస్తు చర్యలేమీ చేపట్టలేదు. దీంతో బాధితులు ఆసుపత్రుల చుట్టూ పరుగులు తీస్తున్నారు. పల్లెల్లో ఆర్ఎంపీలు చాలా వరకూ 'సేవలందిస్తున్న' పెద్ద ఆసుపత్రులు కూడా కిటకిటలాడుతున్నాయి. ఆసుపత్రుల్లో జ్వరాల సంఖ్య పెరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. గతంలో ముందస్తు చర్యలు కనీసం ప్రచారమైనా ఉండేది. ఇంటింటికి వెళ్లండి ప్రజలకు సేవలు అందించండి అంటూ ప్రభుత్వం ఎన్నో కొత్త కొత్త పథకాలు తీసుకొస్తున్న ఎవరి దారి వారిదే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఈ కొత్తనీటి సీజన్‌లో జ్వరాలతో పాటు చర్మవ్యాధులు కూడా వస్తున్నాయని గ్రామీణ ప్రజలు లబోదిబోమంటున్నారు. ఈ కొత్త నీటికి కాళ్లు సరైన చోట్ల పగిలిపోవడం, రక్తాలు కారటం కూడా ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది ఆసుపత్రికి వెళితే ఖర్చుల స్థాయి తట్టుకోలేమంటూ స్థానిక ఆర్ఎంపిల వద్దనే వైద్యం చేయించుకుంటున్నారు. పల్లె నుంచి మండల కేంద్రం వైద్యానికి వెళ్లడానికి సామాన్యుడికి కనీసం రూ.200లకు పైగానే ఖర్చు అవుతుంది. అది కూడా ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తే. ఇది ప్రస్తుతం రోగాల పరిస్థితి. ఈ రోగాలు ముదిరి ఎటు దారితీస్తాయోనని గత అనుభవాలు భయపెడుతున్నాయని వృద్ధులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో గ్రామగ్రామాన వైద్యశాఖ సబ్ సెంటర్లు, పెదకాపవరంలో మండల ప్రాథమిక వైద్యశాల, మండలకేంద్రం ఆకివీడు పట్టణంలో పట్టణ వైద్యశాల 30 పడకల ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వీటికి తోడు సుమారు 15పైబడి ప్రయివేటు ఆసుపత్రులు ఇక్కడ ఉన్నాయి. మండలంలో రెండు పిహెచ్‌సిలు ఉన్నాయి. ఒకటి మండలానికి సంబంధం లేకుండా శివారు ప్రాంతం పెదకాపవరంలో ఏర్పాటు చేశారు. అక్కడికి అధికారులు వెళ్లడం, పరిశీలన చేయడం అంతంత మాత్రమే. మండలం మధ్యలో ఉండవలసిన ఆసుపత్రిని శివారులో పెట్టడంతో ఉపయోగం లేని పరిస్థితి ఏర్పడింది. కాగా మరో ఆసుపత్రిని సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలో నడుపుతున్నారు. అక్కడ పిహెచ్‌సి డాక్టర్ ఎవరో, సిబ్బంది ఎవరో ఎవరికీ తెలియదు. పిహెచ్‌సి ఉపయోగకరంగా లేదు. మండలంలో వైద్యం పరిస్థితి ఈవిధంగా ఉంది. జ్వరాలతో మండల ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులు ఎప్పుడు మేలుకుంటారో మరి.

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

## యాచకులకు అల్పాహారం వితరణ

అల్పాహారం అందజేస్తున్న సభ్యులు

**గణపవరం :** గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక హీరో షోరూమ్ వద్ద 50 మంది వలసకూలీలకు, పేదలకు, యాచకులకు అల్పాహారం అందజేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, జోన్ ఛైర్‌పర్సన్ రావూరి నాగరాజు, కె.స్వర్ణజ్యోతి పాల్గొన్నారు.

## సిపిఎంను ఆదరించండి

### జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

**ప్రజాశక్తి - పాలకోడేరు**

నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సిపిఎంను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. పాలకోడేరులో సోమవారం ప్రజలకు సిపిఎం ఉద్యమాలు, పోరాటాలు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, సామాన్య ప్రజానీకం సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ, సంక్షేమ అందజేసేందుకు తన వంతు కృషి చేస్తుందన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటున్న సిపిఎంను అన్ని విధాలుగా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రియ్య, తాడి రామారావు, కొటికలపూడి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌కు 62 ఫిర్యాదులు

**ప్రజాశక్తి - నరసాపురం**

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 57 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందన్నారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఐదు వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం వర్తించలేదని ఒకటి, సరిహద్దు వివాదాల్లో ఉన్న తమ భూముల సమస్యలకు సంబంధించి సర్వే చేసి సమస్య పరిష్కరించాలని ముగ్గురు, తమ నివాసాల వద్ద గల ఒక చర్చిలో డీజే సౌండ్ సిస్టమ్స్ ఎక్కువ సౌండ్ పెడుతున్నారని, ఫలితంగా ఆశబ్దాన్ని తాము భరించలేకపోతున్నామని పేరుపాలెం నార్త్‌కు చెందిన ఒకరు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్‌కిరణ్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

## సచివాలయం మార్చండి

### పిజిఆర్ఎస్‌లో వినతి

**ఆకివీడు:** స్థానిక జాతీయ రహదారిని ఆనుకుని రిలయన్స్ బంక్ ఎదురుగా ఉన్న భవనంలో ఉన్న సచివాలయ కార్యాలయాన్ని వెంటనే భవనం నుంచి వేరొక చోటుకి మార్చాలని పలువురు అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆ ప్రాంత వ్యాపార ప్రముఖులు సత్యనారాయణ, మరికొంతమంది స్థానికులు కలిసి సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఈమేరకు దరఖాస్తు చేశారు. భవనం ప్రమాదకర స్థితిలో ఉందని, ఏ సమయంలోనైనా కూలిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## పలు అభివృద్ధి పనులు పూర్తి : సర్పంచి

**పెనుమంట్ర :** మండలంలోని నెగ్గిపూడి పంచాయతీ పరిధిలో రూ.15 లక్షల వ్యయంతో మూడు అభివృద్ధి పనులు పూర్తిచేసినట్టు సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి, ఉప సర్పంచి అల్లం సాయిరెడ్డి, గ్రేడ్-1 కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈమేరకు రూ.5 లక్షల 10 వేలతో చించినాడ కాల్వ గట్టులో ఐదు చోట్ల రేవుల నిర్మాణం, వనంపల్లిలో ఒకచోట 5 లక్షలతో డ్రెయిన్, మరోచోట రూ.5 లక్షలతో సీసీ రోడ్డు కం డ్రెయిన్ నిర్మాణం జరిగిందన్నారు. మండల పరిషత్ ఇచ్చిన అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో గ్రామంలోని 1వ వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేస్తామని, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాగానే పెండింగ్‌లో ఉన్న కొన్ని అభివృద్ధి పనులు చేపడతామని వారు పేర్కొన్నారు.

## తహశీల్దార్‌కు వినతి

**కాళ్ల :** కాళ్ళ గ్రామంలో కె.లంక పంట కాలువ గట్టు ఆక్రమణ, భూ సరిహద్దులు సర్వే జరపాలని రైతులు సోమవారం కాళ్ల తహశీల్దార్ జి.సుందర్ సింగ్‌కు వినతిని అందజేశారు. కె.లంక పంట కాలువ నుంచి పొలిమేర కోడు, మొండికోడు పంట కాలువలు ఉన్నాయి. కాలువ గట్టు ఆక్రమణ, భూ సరిహద్దులు మండల సర్వేయర్ సర్వే చేసి సరిహద్దులు గుర్తించాలని పొలిమేర కోడు, మొండికోడు రైతులు తహశీల్దార్ జి.సుందర్ సింగ్‌కు, సహాయ కార్యనిర్వాహణ సాంకేతిక నిపుణులకు విన్నవించారు.

## కల్లు అమ్మకాల్లో స్వచ్ఛత పాటించాలి

### ఎక్సైజ్ ఆఫీసర్ ఇ.స్వరాజ్యలక్ష్మి

**తాడేపల్లిగూడెం :** కల్లు అమ్మకాలలో స్వచ్ఛత పాటించాలని, ఎటువంటి కల్తీలు, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలియజేశారు. సోమవారం తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 27 కల్లు సహకార సంఘ సభ్యులు, 11 వ్యక్తిగత లైసెన్స్ దారులతో స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కల్తీ కల్లు తాగి అనేకమంది అస్వస్థులైన సంఘటన దృష్టిలో ఉంచుకొని స్థానికంగా గీత కార్మికులకు అనేక సూచనలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కల్లులో ఏవిధమైన కల్తీ చేయవద్దని, మత్తు కలుగుటకు ఏవిధమైన రసాయనాలు కలపవద్దని, అలా కల్తీ చేసిన కల్లు తాగడం వల్ల ఆరోగ్యానికి హానికరమని, కల్లు అమ్మకాల్లో పారదర్శకత, ఖచ్చిత ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు జి.మురళీమోహన్, ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేరాలు - ఘోరాలు**

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

### రెండున్నర కాసుల బంగారం, 30 గ్రాముల వెండి అపహరణ

**నరసాపురం:** మండలంలోని గొంది గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శీలబోయిన దేశింగరావు ఈనెల 12న ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. ఈనెల 13న తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగలుగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. సుమారు రెండున్నర కాసుల బంగారం, 30 గ్రాముల వెండి, రూ.5 వేల నగదు పట్టుకుపోయారు. చోరీ ఘటనను స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ టివి.సురేశ్ గ్రామానికి సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. భీమవరం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## కోడి పందేల శిబిరంపై దాడి

### రూ.1,010 నగదు సీజ్

**నరసాపురం :** వేములదీవి ఈస్ట్‌లో కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి ఒక బైక్, రెండు కోడి పుంజులు, రూ.1,010 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## పేకాట స్థావరాలపై దాడి

**నరసాపురం :** నరసాపురం రూరల్ స్టేషన్ పరిధిలోని తుందుర్రు గ్రామ శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపారు. ఈ దాడిలో తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.16,890 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నరసాపురం పట్టణం పొన్నపల్లి శివారు ప్రాంతంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి తెలిపారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,020 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## పోలీసులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పోలీసులు నిత్యం ఎంత బిజీగా ఉన్నా వారు, వారి కుటుంబ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద కోరారు. సోమవారం పాలకొల్లులోని న్యూ లైఫ్ ఆసుపత్రిలో పాలకొల్లు సర్కిల్‌లోని పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇటీవల పలువురు ఎస్ఐ, సిఐలు సైతం గుండెపోటుతో మృతిచెందారని అందుకే తరచు పరీక్షలు చేయించుకొంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. ఈరోజు 27 మంది సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రక్రియ వారం రోజుల పాటు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సిఐలు కె.రజనీకుమార్, గుత్తుల శ్రీనివాస్, ఎస్ఐలు పృధ్వీ, ప్రసాద్, ఆసుపత్రి సిఇఒ తటవర్తి కృష్ణమూర్తి, ముచ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## వీరా సత్యం మృతికి సంతాపం

**ప్రజాశక్తి - పాలకొల్లు**

సీనియర్ పాత్రికేయులు, కళాకారులు వీరా సత్యనారాయణ(సత్యం 91) ఆదివారం రాత్రి పాలకొల్లులోని ఆయన గృహంలో మృతిచెందారు. ఆయనకు ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన కొన్నినెలలుగా వృద్ధాప్యంతో బాధపడుతున్నారు. ఏలూరు టైమ్స్, స్టేట్ టైమ్స్ పత్రికకు 4 దశాబ్దాలకుపైగా విలేకరిగా పనిచేశారు. 4 దశాబ్దాల క్రితం పాలకొల్లు, నరసాపురం, భీమవరంలో హిందీ సినిమాలు ఆడేటప్పుడు తెలుగులో అనువాదం చెప్పేవారు. ఆయన అనేక నాటికలు వేశారు. ఆయన మృతిపట్ల పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు సంతాపం తెలిపి ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పాలకొల్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌వి.సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఐజెయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ఎపియుడబ్ల్యుజె ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిటి వెంకటేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు, కళాకారులు సంతాపం తెలిపారు.

## మధ్యవర్తిత్వంపై అవగాహనకు 1కె వాక్

### 3వ అదనపు జిల్లా జడ్జి బి.లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకనుగుణంగా కోర్టు కేసుల్లో మీడియేషన్‌పై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో 1కె వాక్ నిర్వహించినట్లు భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. కోర్టులో ఏళ్లతరబడి కేసులు పెండింగులో ఉన్నాయని, కక్షిదారులు సహృద్భావ వాతావరణంలో మీడియేషన్ ద్వారా రాజీపడితే తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకుని ప్రశాంతంగా జీవితాన్ని గడపవచ్చని, కేసుల రాజీకి ప్రత్యేకంగా ట్రెయినింగ్ అయిన న్యాయవాదులు నియమించడం జరిగిందని, వారి సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వంపై అవగాహన నిమిత్తం సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి బిఎస్ఎన్ఎల్ కోర్టు కాంప్లెక్స్ వరకూ సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తి లక్ష్మీ నారాయణ అధ్యక్షతన 1కె వాక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బెంచ్ మేజిస్ట్రేట్ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్(న్యూటన్), డిఎస్‌పి జయసూర్య, డిఎన్ఆర్ లా కాలేజి ప్రిన్సిపల్ రఘురాం, న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు.

ఉప్పులూరులో ఉపాధి హామీ ర్యాలీలో పాల్గొన్న సర్పంచి దుర్గారావు

## నిరుపేదలకు ఆదాయ వనరుగా 'ఉపాధి హామీ చట్టం' : సర్పంచి

**ఉండి:** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ప్రధాన ఆదాయ వనరుగా గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉందని ఉప్పులూరు గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఉప్పులూరు గ్రామంలో ఉపాధి హామీ చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దుర్గారావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ జాబు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ తరపున గ్రామంలోని ఉపాధి శ్రామికులకు ఉపాధి పనులను సేకరించడం జరిగిందని, పని వేళల్లో వారికి కల్పించాల్సిన వసతులన్నీ కల్పించేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి అచ్యుత రావు, డిఆర్‌పిలు శ్రీనివాస్, శ్రీరామ్, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

## ఎల్ఇ పాఠశాల విలీనంపై సందర్శన

**పెనుమంట్ర :** మండలంలోని ఎల్ఇ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విలీనం పట్ల గతకొన్ని వారాలుగా జరుగుతున్న నిరసన ఉద్యమం నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈమేరకు సోమవారం సాయంత్రం స్థానిక ఎల్ఇ పాఠశాలను డివైఇఒ డి.మురళీ సత్యనారాయణ బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పేరెంట్స్‌ను, సర్పంచిను కలిసి సమస్య గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక ఎంఇఒ యండమూరి లక్ష్మీ నారాయణ ఉన్నారు. తమ పాఠశాలలోని 3, 4, 5 తరగతులకు చెందిన పిల్లలు ఇక్కడ చదువు కునేలా ఆదేశాలు ఇవ్వాలని స్థానికులు కోరారు.

## పింఛన్ అందించండి

### 'సుపరిపాలనలో తొలి అడుగు'లో వేడుకోలు

**ఉండి :** మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. చిలుకూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వృద్ధులు తమకు పింఛను రావటం లేదని పింఛను వచ్చే ఏర్పాట్లు చేయాల్సిందిగా టిడిపి నాయకుల వద్ద వాపోయారు. సంక్షేమ పథకాలలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొత్తగా రైస్ కార్డులు, ఇళ్ల స్థలాల లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారని, త్వరలోనే వృద్ధాప్య, వితంతు పింఛన్లు ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తారన్నారు.

**మొగల్తూరు :** మండలంలోని జగన్నాథపురం దాడితిప్ప గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కార్యక్రమాలలో జోగి రాధాకృష్ణ, నడింపల్లి శ్యామ్‌కుమార్ రాజు, శెట్టి బాలాజీ, ఇందుకరి శ్రీనివాసరాజు ఉన్నారు.

## వృత్తిలో మానసిక ప్రశాంతత ఎంతో అవసరం

### ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనలక్ష్మి

మాట్లాడుతున్న ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి ధనలక్ష్మి

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

వృత్తిపరంగా ఎదురయ్యే ఒత్తిడి తగ్గించుకోవాలంటే మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని, దీంతో అనారోగ్యానికి గురికాకుండా ఉంటామని, అలాగే రోగులకు మరిన్ని సేవలు అందించగలమని ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక ఏరియా హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్సులకి స్ట్రెస్ మేనేజ్మెంట్, ఫిజియోథెరపీ ట్రెనింగ్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం, ఎన్‌సిడిలో భాగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉంటే మరిన్ని సేవలు అందించవచ్చని, ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిటెండెంట్ డాక్టర్ మాధవి కళ్యాణి, జిల్లా ఎపిడెమియాలోజిస్ట్ జి.సుభాష్, సైకాలజిస్ట్ శ్రీనివాస్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రహీమ్, సోషల్ వర్కర్ సుమన్, ఎఫ్ఎల్‌సి గణేష్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ప్రజాశక్తి - పాలకొల్లు**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల తలరాతను సిఎం చంద్రబాబు మారుస్తున్నారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలో పేద, మధ్యతరగతులకు చెందిన 54 మందికి సిఎం సహాయనిధి రూ.50 లక్షల చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మానవత్వంతో పనిచేస్తుందని, పేదలు వైద్యం కోసం చేసిన అప్పుల ఇబ్బందులు లేకుండా ఉండకూడదనే ఉద్దేశ్యంతోనే సిఎం సహాయ నిధిని అందిస్తుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో వారంవారం అరకోటికిపైగా అందిస్తున్నట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో అరాకోరా మాత్రమే అందజేసే వారిని నేడు బాధితులు ప్రతి ఒక్కరికి అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి వైద్య సాయం పొందిన ప్రతి ఒక్కరూ తమకు జరిగిన ఉపకారాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేసేలా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు జివి.పొట్నూరు శ్రీనివాస్, మండాది అవినాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత




విద్యా సామగ్రిని అందజేస్తున్న మందపాటి కృష్ణమూర్తి

**ప్రజాశక్తి - కాళ్ల**

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు వి.రాంబాబు అన్నారు. మండలంలోని బొండాడ మోడల్ ప్రైమరీ స్కూల్, బొండాడగూడెం ఫౌండేషన్ స్కూల్, బొండాడ చినపేట ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులకు బొండాడనీటి సంఘం అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి అందజేశారు. సోమవారం బొండాడ మెయిన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు వి.రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బొండాడ గూడెం ప్రధానోపాధ్యాయులు డివి.సత్యనారాయణ మాట్లాడుతూ మందపాటి కృష్ణమూర్తి అందించిన నోటు పుస్తకాలు, పలకలు విద్యాసామగ్రి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మందపాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, బలపాలు, చాక్‌పీసులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత మందపాటి కృష్ణమూర్తిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొండాడ చినపేట ప్రధానోపాధ్యాయులు ఎంఎన్.చంద్రశేఖర వర్మ, ఉపాధ్యాయులు ఆదియ్య, ముసలయ్య బాబు, ఎస్తేరు రాణి, ఎస్ఎంసి ఛైర్మన్ జి.నరేష్, తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

### ట్రస్ట్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి




నగదు బహుమతి అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

**ప్రజాశక్తి - ఉండి**

ప్రభుత్వ పాఠశాలలో చదివే మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడమే తమ గొర్తి ఈశ్వర ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి అన్నారు. సోమవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పదో తరగతిలో 559 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన గ్రంధి లక్ష్మీనారాయణ, శ్రీయశ్వంత్‌కు రూ.15 వేల నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ గొర్తి ఉషాబాల పవన్ కుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం గొర్తి ఈశ్వర ట్రస్ట్ ఏర్పాటు చేశారని, పదో వసంతంలోకి అడుగుపెట్టిన ఈ ట్రస్ట్ ద్వారా 30 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నుంచి 499 మార్కుల లోపు పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, 574 మార్కులు లోపు వచ్చి ప్రథమ స్థానం సాధిస్తే రూ.15 వేల నగదు బహుమతి, 575 మార్కులు పైబడి వస్తే రూ.25 వేలు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ట్రస్ట్ ఛైర్మన్ పవన్ కుమార్, పాఠశాల హెచ్ఎం రామలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్యామలరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, 2025-26 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఉన్నారు.

## దళిత గ్రామాలంటే ఎంతో అభిమానం : మంత్రి

**ప్రజాశక్తి - యలమంచిలి**

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పట్ల ఉన్న గౌరవంతో దళిత గ్రామాలంటే తనకు ఎంతో అభిమానమని, అందులో ఆర్య పేట ఒకటని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. మండలంలోని ఆర్యపేట దళిత గ్రామంలో రూ.86 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఆయన చేశారు. ముందుగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, ఆరిమిల్లి రామశ్రీనివాస్, బొప్పన హరికిషోర్, పీతల శ్రీను, జనసేన నాయకులు పాల్గొన్నారు,

## నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 15 నుంచి చిన్న పిల్లల కోసం మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు సోమవారం ఇక్కడ తెలిపారు. ఈ మేరకు ఈనెల 15 నుంచి 18 వరకు తొలివిడత, 22 నుంచి 25 వరకు రెండో విడత క్యాంపులు ఉంటాయన్నారు. ఈ సమాచారం అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో కార్యకర్తలు ప్రచారం చేసి, చిన్న పిల్లలందరి ఆధార్ నమోదు పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థులకు వస్త్రాలు బహూకరణ

**పాలకొల్లు రూరల్ :** మండలంలోని పందిగుంట గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గల 16 మంది విద్యార్థులకు పాలకొల్లుకు చెందిన బాలీవుడ్ రెడీమేడ్ షాప్ అధినేత బొండాడ భాస్కర్ నూతన వస్త్రాలను బహూకరించారు. పేద విద్యార్థులకు అండగా నిలిచినందుకు బొండాడ భాస్కర్‌కు ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబుతో పాటు పాఠశాల విద్యా కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కోటేశ్వరరావుకు సన్మానం

**ఆకివీడు :** స్థానిక సినీ సంగీత గాయకుడు సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావును హైదరాబాద్‌లో ప్రముఖ సినీనటులు తనికెళ్ల భరణి, ప్రకాష్ రాజు భాగ్యనగరం రవీంద్ర భారతిలో సన్మానించారు. తనికెళ్ల భరణి నాటికల రచనల ప్రస్థానం ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన లలిత కళా సాంస్కృతిక సంస్థ 'సంగమం ఫౌండేషన్' ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఆది, సోమవారాలు రెండు రోజులపాటు భరణి రచించిన నాటికల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత తనికెళ్ల భరణిని సంగమం ఫౌండేషన్ సత్కరించింది. కాగా అదే సంస్థ గత 25 సంవత్సరాలుగా లలిత కళా సాంస్కృతిక సంస్థ సరిగమ సంగీత పరిషత్‌ను స్థాపించి నిరాకటంగా నిర్వహిస్తున్న ప్రముఖ సినీ పాటల గాయకుడు ఆకివీడుకి చెందిన ఎస్.కోటేశ్వరరావును సత్కరించారు. ప్రత్యేక పురస్కారం అందజేశారు.

## అతిధి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**వీరవాసరం :** వీరవాసరం విజిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిధి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రిన్సిపల్ సిహెచ్‌వివి.రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం విభాగంలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులున్న వారు అర్హులన్నారు. ఈనెల 16వ తేదీలోపు అర్హత సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 17వ తేదీన డెమోక్లాసులకు, ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

## 21న వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

**ఆచంట :** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈనెల 21వ తేదీన ఆచంట నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లోని వికలాంగులకు ఈ నెల 21న పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ఉచితంగా వినికిడి, ట్రై సైకిల్స్ వంటి ఉపకరణాలు అందించేందుకు అర్హతల నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కృష్ణమోహన్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వికలాంగులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరై ఉచిత ఉపకరణాలు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రకటన

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, BHIMAVARAM

O.S.No.410/2024

Between :

**Plaintiff :** Canara Bank, JP Road Branch, Bhimavaram, Rep by its Branch Manager.

**Defendants :** M/s.R.S.Vastralayam Bhimavaram, Rep by its Prop. Nimmala Rama Srinivas and another

**Ist Defendant Address :**
M/s.R.S.Vastralayam, Bhimavaram, Rep by its Prop.Nimmala Rama Srinivas, D.No.17-6-14, Mentevari Street, Bhimavaram.-1.

**2nd Defendant Address :**
Nimmala Rama Srinivas, S/o.Venkata Subba Rao, Business, D.No.17-6-34, Angel cut Picses, Mentevari Street, Bhimavaram-1.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అది అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరపున ప్రతివాదులపై శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు ది.4-8-2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేనిఎడల శ్రీకోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

ఆల్తి శివరామకృష్ణ
అడ్వకేట్, శ్రీరాంపురం
భీమవరం. భీమవరం
తేది.10.7.2025 సెల్: 98484 60585

ప్రకటన

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, BHIMAVARAM

O.S.No.231/2024

Between :

**Plaintiff :** Union Bank of india Industrial Estate, Branch Bhimavaram, Rep by its Branch Manager.

**Defendants :** 1.Uday Garments Bhimavaram, Rep by its Prop.Mallula Sirisha & another.

**Ist Defendant Address :**
Uday Garments, Bhimavaram, Rep by its Prop. Mallula Sirisha, Plot No.23, Industrial Area, Bhimavaram.

**2nd Defendant Address :**
Mallula Sirisha, W/o.Uday Bhaskar, D.No. 10-2-50/a, Gubbala Narasimha Rao, Building, Chinaranganipalem, Bhimavaram.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అది అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరపున ప్రతివాదులపై శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు ది.4-8-2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేనిఎడల శ్రీకోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

ఆల్తి శివరామకృష్ణ
అడ్వకేట్, శ్రీరాంపురం
భీమవరం భీమవరం.
తేది.10.7.2025 సెల్: 98484 60585